కథానిక

# నడుస్తున్న చలపతి

"రాజ్‌పాల్"

తల్లులు ప్రమిదెల్లో నూనెపోస్తూ వత్తుల్ని వెలిగిస్తున్నారు. పిల్లలు దివిటీలు కొట్టి, రవ్వలతో సమానంగా గంతులు వేస్తున్నారు ఒళ్లు తెలియని ఆనందంతో. ఎందుకు వచ్చింది బాబూ ఈ బాధ అనుకుంటున్నాయి. హీన స్వరంలో సంగీతంలో లీనమౌతూ కొన్ని క్రిమికీటకాలు. కాలిపోయిన టపాకాయల్ని ఏరుకోవటంలో తగవులాడుకుంటున్నారు దూరంగా కొందరు ముష్టి పిల్లలు. మధ్యమధ్య తల్లులు తమ పిల్లలకి చెప్పే జాగ్రత్తలు చెవుల్లో రింగుమంటున్నాయి. ఇవన్నీ చలపతికి మసగ్గానే వున్నాయి. అడుగులు ముందుకి పడుతున్నాయి. లాంతరు స్తంభాలు అతన్ని వదలి వెనక్కి నడుస్తున్నాయి. కొన్ని వూహలు మాత్రం అతన్ని వదలకుండా వెంటాడుతున్నాయి. తలకూడా పైకెత్తకండా నడుస్తున్నాడు. ఎంతమంది రోడ్డుమీద బౌట్లు కాలుస్తున్నప్పటికీ యెన్ని తన కాళ్ళకింద నలుగుతున్నప్పటికీ తనకు సంబంధం లేదన్నట్లు తలచే సాధువులా చలపతి నడచిపోతున్నాడన్నమాటే కాని—

నడుస్తున్న చలపతికి ఒక్కసారి స్త్రీ కంఠస్వరం వినపడింది. అతన్ని కాదంది తన ఆత్మ. కాని యెందుకో ఆగాలనిపించింది. నడవాలనుకునే అడుగులు ముందుకి వేసేడు. మళ్ళీ వినపడింది వెనుకటి స్వరమే!

"గోపీ! కళ్లు కనపడటల్లేదూ? ఎన్నిసార్లు చెప్పాలి? ఆగు రోడ్డుమీద ఎవరో మనుషులు వస్తున్నారు. వాళ్లు వెళ్ళిపోనీ తర్వాత నీ చిచ్చుబుడ్డి కాల్చవచ్చు" అని కసిరింది ఆ స్త్రీకంఠం. ఆమె వాళ్ళ అక్కయ్యేమో? పచ్చ మేడలోంచే వచ్చింది ఆ కంఠస్వరం. వెలిగించే చిచ్చుబుడ్డిని వెలిగించకుండా గోపీ వెనక్కి అడుగులు వేసేడు. చలపతి వెనక్కి తిరిగి చూసేడు. దీపాల కాంతిలో మెరుస్తూంది ఆ స్త్రీ మూర్తి. ఎక్కడో చూసినట్లు చలపతికి జ్ఞప్తి కలిగింది. మెరిసే మనిషి మాట్లాడలేదు. చలపతి ఆలోచనలో ఒక తళుకు మెరిసింది.

"ఎన్నాళ్ళయింది చూసి?" అనే స్మృతులను కలిపింది. శారదా! అనగల్గేడు పెదవులమీద నే. దూరంలో బౌటు పేలింది. శారద మాట్లాడలేదు పకపకా నవ్వడం తప్ప. ఆ నవ్వులో యెంతో హేళన ప్రతిధ్వనించింది చలపతికి. పూర్వ స్మృతులన్నీ ఒక్కసారి లేచి నిలడ్డయ్. కదలసాగేయ్ నీడల్లా.

చలపతి ఆలోచనలు వెనక్కి ప్రయాణం చేసేయ్. పదిసంవత్సరాల క్రితపు సంఘటనలు చలపతి కళ్లెదుట కదలసాగేయ్ నీడలా. ఎంతో ప్రకాశవంతంగా ప్రతి బింబిచేయ్.

* * *

చలపతి-శారద ఒకే చిన్నబడిలో చదువుకుంటుండేవారు. ఒకరోజు క్లాసులో శారద చలపతిని పెన్సిలుతో నెమ్మదిగా పొడిచి పిలిచింది. వెనక్కి తిరిగేడు చేసే లెక్కని ఆపుతూ.

"మీయింట్లో యెన్ని కొన్నారు?" అన్నది. మేష్టారి బెత్తం యింతలో బల్లమీద చప్పుడైంది. దూరంగా తొలిగేరు యిద్దరుకూడా. చప్పుడు దూరం అయ్యేటప్పటికి యిద్దరూ దగ్గరగా వచ్చారు.

"దీపావళికి ఎన్ని కొన్నారు?" చలపతికి శారద మాటలు పూర్తిగా వినపడలేదు ఖంగారులో—

"ఏమిటీ?" అన్నాడు ఎందుకో నవ్వుతూ.

"టపాకాయలు" అని పుస్తకంమీద రాసి చూపించింది.

చలపతికి ఏం సమాధానం చెప్పాలో కూడా తెలియలేదు. మాట్లాడకుండా వుందామన్న చిన్న భావాలు ప్రవేశించాయి. ఇంతలో మేష్టారి బెత్తం బల్లమీద చప్పుడైంది. ఇదే సమయమనుకొని వెనక్కి జరుగుతూ "అయిదు

బుట్టల టపాకాయలు కొన్నారు" అని తెలివిగా తప్పించుకున్నాడు.

"మరి మీయింట్లో యెన్ని కొన్నారు?" వెంటనే వేశాడు ప్రశ్న.

చిన్నపోయింది శారద మనస్సు. కానీ ధైర్యం తెచ్చుకొని నాలుగుబుట్టల టపాకాయలు కొన్నారు అన్నది. చలపతి మాత్రం తన సగర్వమైన ముఖాన్ని పైకెత్తాడు. శారదకి చలపతితో మాట్లాడడానికి ధైర్యం చాల లేదు. కాని చలపతితోమాత్రం సాయంకాలం ఆడుకోడానికి వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

చలపతి మనస్సుకూడా యెంతో చిన్నపోయింది. ఆరోజు పాఠాలు అతని కేమాత్రం బుర్ర కెక్కలేదు. ఇంటికి వచ్చినా తనలోని వ్యథ తీరలేదు.

"అమ్మా! టపాకాయలు కొనవా?" ఎంతో దీనంగా అడిగాడు.

అమ్మ మాట్లాడలేక పోయింది తన కళ్ళనీళ్లు తుడుచుకోవడం తప్ప. అన్నయ్యను కొనమంటే 'అట్లాగే లే' అని అదోమాదిరిగా సమాధానం చెప్పాడు. అక్కడికీ చలపతి యెంత సంతోషపడుతున్నా వెనకాల అంత వుత్సాహం లేందే? చలపతి యెంత సంతోషపడి ఎంత గంతులేసినా పక్కపక్కల్ని అమ్మ పెట్టుకునే కంటినీళ్లు తనని కలవర పెడుతూనే వున్నాయి.

కాలెండరులోని నల్లచుక్క రోజురోజుకీ ముందుకి దూకుతోంది. అటకమీదనుంచి ప్రమిదెలు తీద్దామని తొందరపడితే అమ్మ అంగీకారం తెలపటంలేదు. చలపతికి అర్థం కావటం లేదు అమ్మ పడుతున్న వేదన. శారద సాయంకాలం ఆడుకోవటానికి వస్తానంది. అయిదు బుట్టల టపాకాయలు చూపించమంటుంది. ధనవంతుల పిల్ల శారద చేతిలో చలపతి ఓడిపోయే సమయ మొచ్చింది. అన్నట్లు గడియారం గంట కొట్టింది. "చలపతీ" అన్న స్వరం గడియారం గంటకి శృతి కలిపింది. తానే స్వయంగా యింట్లో లేడని చెప్పించా లనుకున్నాడు. కాని చలపతి తప్పించుకోవడానికి వీలులేకుండా శారద అడుగులు తనని సమీపించాయి.

"దొంగాటకి రావూ?" అడిగింది శారద.

"కడుపులో నొప్పిగా వుంది" చలపతి అబద్ధమే ఆడేడు.

"నాన్నదగ్గర మందిప్పిస్తాగా" అన్నది శారద.

చలపతికి ఎంతో సిగ్గేసింది. ఆమె చిన్ని చేతుల్లో తన హృదయాన్ని చూసుకొని ఎంతో చిన్నపోయేడు. తలవంచుకొని తడబడే మాటల్తో "వద్దులే" అన్నాడు.

ఉండుండి ఒక్కసారిగా "టపాకాయలు చూపించవూ?" అడిగింది శారద.

హృదయం స్థానం తప్పింది. మెదడు ఆలోచనలతో బరువెక్కింది. అంతా చీకటిగా వుంది. ఏమి చెప్పటానికి ఆలోచన తట్టలేదు.

"అన్నయ్య ఇంట్లో లేడుగా" అన్నాడు.

"లేకపోతే నీకేం?" అన్నది శారద.

"తాళం చెవులూ" అన్నాడు చలపతి. తనకు తట్టిన అబద్ధపు ఆలోచనకి తానే యెంతో మెచ్చుకున్నాడు.

శారద మాట్లాడలేక పోయింది చలపతి యిచ్చిన సమాధానానికి.

"రాత్రి వచ్చి చూస్తాలే" అన్నది శారద.

వంటింట్లో అమ్మ ఒక్కతే వంట చేస్తూ వుంది. పీటమీద కూచుని ఏదో ఆలోచిస్తూ వుంది. కళ్లు పువ్వుల్లా వున్నాయి. అమ్మదేనికో ఎప్పుడూ కళ్లమ్మటనీళ్లు పెట్టుకుంటూనేవుంటుంది.

"అమ్మా!" అన్నాడు చలపతి.

సమాధానం లేదు అమ్మదగ్గర్నుంచి.

"టపాకాయలు కొనవా?" అడిగేడు చలపతి.

వెంటనే అమ్మ మాట్లాడలేకపోయింది. దుఃఖాన్ని దిగమింగుకొని — "యెట్లా కొనడం నాయనా? మామయ్యలేడుగా?" అన్నదిఅమ్మ.

చలపతి కళ్ళమ్మట నీళ్లు తిరిగేయి. తనకు తండ్రిలేని కొరతను మామయ్యా తీరుస్తూండేవాడు. వాళ్ళ కుటుంబానికి మామయ్యా ఎంతో అండగా వుండేవాడు. మామయ్యాగాని వుంటే కొత్త బట్టలు కుట్టించేవాడు. ఎన్నో రకాల మతాబాలు, అవ్వాయిలు, చిచ్చుబుడ్లు కొనుక్కొని వచ్చేవాడు. ఎంతో నేర్పరితనంగా అవ్వాయిల్ని ఆకాశం అంటేట్టు వేసేవాడు.

తనంటే మామయ్య యెంతో ప్రాణం యిచ్చేవాడు. ఎన్నో సినిమాలకు తీసుకువెళ్ళేవాడు. ఎన్నో బొమ్మల పుస్తకాలు కొనిపెట్టేవాడు. దీపావళి రోజున మరీ చిన్నపిల్లవాడైపోయి యెంతో అల్లరిచేస్తూ సరదాగా వుండేవాడు. అన్ని పండగలలోకి దీపావళి పండక్కి మామయ్య బలే సంతోషంగా వుండేవాడు. ఎంతో వుత్సాహం కల్గించేవాడు. చిన్నప్పటి నుంచీ మామయ్యను తన చేతుల్లో పెంచి పెద్దవాణ్ణి జేసింది అమ్మ. పెద్దవాడై వుద్యోగం చేస్తున్న మామయ్యను చూస్తే అమ్మకు ఎంతో సంతోషంగా వుండేది. పెద్దవాడైన మామయ్య యెంతో సహాయం చేస్తూ, సలహాదారుడుగా వుండేవాడు. మామయ్య చూపించే ఆదరణ అభిమానాలకి అమ్మ యెంతో మురిసిపోతూ వుండేది. మామయ్య పోగానే అమ్మకు కుడి చేయి విరిగినట్లే అయింది. మామయ్యకోసం అమ్మ యెంతో దుఃఖిస్తూ వుంటుంది.

మామయ్యలేని దీపావళి చలపతి లెక్కలో దీపావళి కాదు. యిటువంటి పండుగలు చేసుకొన్నంత బుద్ధితక్కువపని ఇంకొకటి లేదు అనుకున్నాడు. మామయ్యతోటే అన్ని దీపావళులు కూడా పోయేయి అనుకున్నాడు. ఇక ఆ దీపావళి గురించి కూడా ఆలోచించ దలచుకోలేదు చలపతి.

అన్నయ్య వట్టి చేతులతోనే యింటికి వచ్చేడు. గడియారం ముల్లు ముందుకు నడుస్తోంది. అరుగులన్నీ అమావాస్యలోని భాగాన్ని పంచుకున్నాయ్. ఊరంతా మాత్రం వుత్సాహంగా వుంది. ఎటు చూసినా చీకట్లో వూరంతా తళుక్కుమంటూంది. ఆ దీపాల వెలుగులో చలపతి నుంచోలేకపోయేడు. మామయ్య అనుభవాలు చలపతికి బాణాల్లా గుండెలకు దూసుకొనిపోయేయ్.

“మామయ్య లేడే? మామయ్య పోయి యింకా సంవత్సరమన్నా కాలేదే? యింత చిన్న వయస్సులోనే మామయ్య చనిపోవాలా? మామయ్యను తీసుకుపోయేబదులు మూలమంచం మీద మూల్గుతున్న ఆ ముసలమ్మనన్నా భగవంతుడు ఎందుకు తీసుకుపోడూ? మూల ముసలమ్మ బాధ పెడ్తున్నట్లు మామయ్య ఒక్క పీసమన్నా యితరులను బాధ పెట్టేవాడు కాడే? భగవంతుడికి మామయ్య చేసిన పెద్ద పాపమేమిటి ముసలమ్మ చేసుకోని పాపమేమిటి! భగవంతుడికి యీమాత్రం న్యాయం తెలవదా? చలపతికి ఆలోచనలు శరపరంపరగా తట్టేయి. మామయ్య గురించే ఆలోచిస్తున్న చలపతికి, “చలపతీ!” అనే స్వరాలు వినపడ్డాయి. తేలిపోయే కాళ్ళతో పొంగిపోయే దుఃఖాన్ని ఆపుకుంటూ స్నేహితులు కాలుస్తున్న మతాబాల వెలుగులోకి వచ్చేడు. పరిసరాలన్నీ అతనికి ఖంగారుగా వున్నాయి.

“బుట్టలన్నీ కాల్చేశావా?” అడిగింది శారద.

చలపతి మాట్లాడలేక పోయేడు.

“మాట్లాడవే? అన్నీ అబద్ధాలేనా?” అన్నది శారద.

“మామయ్య లేడుగా?” అని మాత్రం అనగ్గలేడు చలపతి దుఃఖాన్ని ఆపుకుంటూ.

“లేకపోతే నీకేం? పోయినవాళ్లు మళ్ళీ నీతో కాలుస్తారనుకున్నావా?” అని వెంటనే నవ్వింది. ఆ నవ్వులో ఎంతో హేళన ప్రతిధ్వనించింది చలపతికి.

పోయిన మామయ్య అంటే ఎంత హేళన శారదకి? తనను ప్రాణసమానంగా చూసిన మామయ్యనేనా శారద హేళన చేస్తూంట.

కోపంతో “శారదా” అనగలిగేడు చలపతి.

“ఏం మామయ్య పోతే టపాకాయలు మానాలా? పోనీలే మా యింట్లో కాల్చుకుందాం రా” అన్నది.

చలపతి క్రోధంతో వణికేడు. అవమానంతో తేలిపోతూ ముందుకి నడచేడు. “చలపతీ!” అన్న స్వరం వెంటాడింది. కాని తను వెనుకంజ వేయలేదు. తన హృదయం శారదను క్షమించమని ప్రాధేయ పడుతూనే వుంది. కాని అడుగులు ముందుకి సాగిపోయేయి.

* * *

రోజులు... నెలలు... దీపావళులు దాటిపోతున్నాయి. అడుగులు కూడా—

అన్ని దీపావళులలాగే ఈ దీపావళిని కూడ దాటి చలపతి ముందుకు నడిచేడు, పూర్వ స్మృతులను వదిలించుకొని, శారద నుంచి చూపును మరల్చుకొని.